విశాలాంధ్ర విజయనగరం
పేజ్ నెం. 8
శుక్రవారం 20, జూన్ 2025

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో గల 11 హైస్కూల్స్, 06 యుపి స్కూల్స్, 50 ప్రైమరీ స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టాలని ఎంఈఓ జె.త్రినాధ రావు అన్నారు. గత విద్యా సంవత్సరంలో గల విద్యార్థుల సంఖ్య కంటే ఈ సంవత్సరం పిల్లల చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందజే యుచున్న వివిధ రకాల ప్రభుత్వ పథకాలను తల్లిదండ్రులకు వివరించి పిల్లలు ప్రభుత్వ బడులలో చేరేలా ప్రేరేపించాలని సూచించారు. ఈ సమావేశంలో హెచ్ఎంలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హమాలీల బతుకుల్లో నీలినీడలు

- హమాలీల బతుకుల్లో నీలినీడలు
- కొత్త విదానంతో పెరిగిన పనిభారం
- ప్రభుత్వం ఇచ్చే ధర గిట్టుబాటు కాని వైనం
- భవిష్యత్‌లో హమాలీల వృత్తులు ప్రశ్నార్ధకమే

విశాలాంధ్ర - విజయనగరం: నిత్యం బరువులను మోసే వృత్తి వాళ్ళది.. రోజంతా బస్తాలు మోస్తే వచ్చే కాస్తా కూలిడబ్బులతో కుటుంబాన్ని నడుపుకుంటున్న పేద కుటుంబాలు వారివి. ప్రభుత్వ విధానాలు మారినప్పుడు వాళ్ళ జీవితాలపై నిర్ణయాలు ప్రభావం చూపుతున్నాయి. అందులో భాగంగా నూతన కూటమి సర్కార్ అమలు చేసిన నూతన విధానంతో హమాలీల జీవితాలలో చీకట్లు కమ్ముకుంటున్నాయి. పనిభారం పెరగడంతోపాటు కనీస గిట్టుబాటు కూలీ రాకపోవడంతో తీవ్ర ఆవేదనలో హమాలీలు మునిగిపోయారు. తమపై ప్రభుత్వం దృష్టిసారించాలని, తమ కష్టాలను గుర్తించాలని కోరుతున్నారు..

పెరిగిన పనిబారంతో ఇబ్బందులు..

జిల్లా కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ గిడ్డంగిలో మొత్తం 41 మంది హమాలీలు పనిచేస్తున్నారు. వీరిని పలుకరిస్తే వారి మాటలు తీరని ఆవేదనను తెలియజేస్తాయి. గతంలో పాఠశాలలకు,రేషన్ డిపోలకు, వసతి గృహాలకు ఒకే రకమైన బియ్యాన్ని సరఫరా చేసేవారు. అదికూడా 50కిలోల బస్తాలను పంపిణీ చేసేవారు. హమాలీలు 3కిలోమీటర్లలోపు ఉన్న పాఠశాలలకు,వసతి గృహాలకు అన్‌లోడింగ్‌కు వెళ్ళేవారు. క్వింటాకు రూ.12లను ప్రభుత్వం చెల్లించేది. కొత్తగావచ్చిన కూటమిప్రభుత్వం రేషన్ డిపోలకు ఒక రకమైన బియ్యంను సరఫరా చేస్తుండగా, వసతిగృహాలకు, పాఠశాలలకు క్యూఆర్ కోడ్‌లతో ప్రింట్ చేసిన 25కిలోల ప్యాకెట్లును సరఫరా చేయడం జరుగుతోంది. దీంతో హమాలీలమీద పనిభారం, వత్తిడి పెరిగింది. గతంలో రెండుసార్లుకు బదులుగా నేడు నాలుగు సార్లు లోడింగ్‌కు దిగాల్సి వస్తోంది. శారీరక శ్రమ అదికమైన ధర మాత్రం గతంలో మాదిరిగానే ఇవ్వడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సార్లు లారీలు దూరంగా ఆపి వేయాల్సి వస్తున్న సమయంలో నడవలేని స్థితిలో బస్తాలను అన్‌లోడింగ్ చేస్తున్నామని, మాకష్టాన్ని గుర్తించేవారే కరువయ్యారని వాపోతున్నారు. ఇలాగే పనిభారం పెరిగితే భవిష్యత్‌లో హమాలీలుగా పనిచేసేందుకు ఎవరూ ముందుకురాని పరిస్థితి నెలకొంటుందని అంటున్నారు.

నూతన విధానంతో ఇబ్బంది పడుతున్నాం

కొత్త ప్రభుత్వం 25కిలోల ప్యాకెట్లు పెట్టడం వలన పనిభారం మరింత పెరిగింది. ఎక్కువ మంది పనిచేయాల్సి వస్తోంది. కానీ పాత ధరనే ఇస్తున్నారు. దీంతో గిట్టుబాటు కావడంలేదు. ప్రభుత్వం ఆలోచించాలి.

- ఆర్.శ్రీరాములు, హమాలీ

రూ.500 కూడా కూలీ రావడంలేదు

నెలలో 20 రోజుల పని ఉంటుంది. రోజుకు రూ500లు కూడా రావడంలేదు. దీంతో కుటుంబాలను పోషించడం ఇబ్బంది అవుతోంది. పని చూస్తే గతంకన్నా పెరిగింది. ఇబ్బందికర పరిస్థితిలో పనిచేస్తున్నాం.

- ఆర్.శ్రీను, హమాలీ

పనివత్తిడి పెరిగిపోయింది

22 ఏళ్ళగా పనిచేస్తున్నాను. ఎన్నడూ ఇంత స్థాయిలో పనివత్తిడిలేదు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు మాతోనే సరుకులు అందజేస్తున్నారు. దీంతో హమాలీలు తీవ్రంగా పనివత్తిడి పెరుగుతోంది. గతంలో మాదిరిగా ధరలు ఇవ్వడంతో గిట్టుబాటు కావడంలేదు.

- ఆర్.గోపి, హమాలీ

వెంటనే ప్రభుత్వం స్పందించాలి

హమాలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలి. పనివత్తిడికి తగ్గట్టు గిట్టుబాటు కూలీ ఇవ్వాలి. హమాలీలకు తగిన సౌకర్యాలను కల్పించాలి. దీనిపై రాష్ట్ర స్థాయిలో స్పందించి యూనియన్ ద్వారా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్తాం.

- పి.కామేశ్వరరావు, జిల్లా హమాలీల యూనియన్ గౌరవాధ్యక్షులు

సికిల్ సెల్ వ్యాధి పట్ల అప్రమత్తంగా వుండాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవన రాణి

విశాలాంధ్ర - మెంటాడ: ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా సికిల్ సెల్‌పై మెంటాడలోని ఉయ్యాడ వలస గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కలిగివుండాలని తెలిపారు. అనంతరం పోస్టర్లు, పుస్తకాలు ప్రారంభించారు. జిల్లా లెప్రసి,

ఎయిడ్స్, క్షయ అధికారి డాక్టర్ కె.రాణి మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి పట్ల అవగాహనతో ఉండాలని అందరూ పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెంటాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జె.లోకప్రియ, ఎంపీడీఓ ఏ.భానుమూర్తి, లోతుగెడ్డ గ్రామ సర్పంచ్ సారా భీమారావు, ఇ.ఓ.పి.ఆర్.డి విమల కుమారి, సి.హెచ్.ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు పశువులు తరలింపు

విశాలాంధ్ర - గుర్ల: మండలంలోని గూడెం టేకు తోటలో ఉన్న మూగజీవులను పోలీసులు గోశాలకు తరలించారు. నాలుగు రోజులుగా ఇటువంటి మేత, నీరు లేకపోవడంతో మూగజీవుల అరుపులు చూసి స్థానికులు గుర్ల పోలీసులకు సమాచారం అందించారు. ఈ పశువులు గూడెం, సారిపల్లికి చెందిన వారివిగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీటిని సంతలో విక్రయించడానికి ఉంచినట్లు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు (సతీష్) గురువారం భూమి పూజ చేశారు. గ్రామానికి చెందిన చింతల వీధిలో రోడ్డు శిధిలావస్థకు చేరుకోవడంతో మండల పరిషత్ నిధుల నుండి రూ.2 లక్షలు మంజూరు చేసి సీసీ రోడ్డు నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు వైసీపీ నియోజకవర్గ బీసీ కార్పొరేషన్ అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, మండల ప్రాదేశిక సభ్యులు ఆకుల సత్యనారాయణ, గ్రామ పెద్దలు తొండవరపు మల్లేశ్వరరావు, పత్రి కాళీ, కోటమశెట్టి గణపతి, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుమార్ పాల్గొన్నారు.

రహదారిని పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రాజా కాలేజ్, ఫూల్ బాగ్ జంక్షన్ వరకు రోడ్డు పలుచోట్ల గుంతలు ఏర్పడి ప్రజలకు ఇబ్బంది కలుగుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు, మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మిలతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి తక్షణమే మరమ్మతులకు కావలసిన ప్రతిపాదన తయారు చేసి, పనులను చేపట్టాలని ఎమ్మెల్యే బేబి నాయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖలో బదిలీలు

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖలో పలు విభాగాల్లో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. సహాయ సంచాలకులు 6, పశువైద్య శస్త్ర చికిత్సకులు 26, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ 5, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ 13, లైవ్ స్టాక్ అసిస్టెంట్ 22, వెటర్నరీ అసిస్టెంట్ 10, ఆఫీసు సబార్డినేట్లు 33 మంది వివిధ ప్రాంతాలకు బదిలీ అయినట్లు జిల్లా పశు సంవర్ధక జాయింట్ డైరెక్టర్ వైవీ రమణ తెలిపారు. బదిలీలు పారదర్శకంగా నిర్వహించామని ఆయన పేర్కొన్నారు.

శ్రీ చైతన్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - బొబ్బిలి: రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో జరుగుతున్న అక్రమాలు అఖిల భారత విద్యార్థి సమైక్య నాయకులు వెలికి తీస్తున్న విషయం పాఠకులకు విధితమే. అందులో భాగంగానే శుక్రవారం శ్రీ చైతన్య జూనియర్ కళాశాల నందు పుస్తకాలు అమ్మకాలు చేస్తుండగా అఖిల భారత విద్యార్థి సమైక్య నాయకులు వ్యాపారాన్ని వెలికి తీసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో అక్రమంగా పాఠ్యపుస్తకాలు యూనిఫాములు పేరుతో వేలకు వేలు విద్యార్థుల దగ్గర నుంచి దోచుకుంటున్నారని విద్యా సంవత్సరం రాకముందే అనేకమైన అక్రమ అడ్మిషన్లు పేరుతో విద్యార్థులను నిలువెల్లా మోసం చేశారని ప్రస్తుతం పుస్తకాలు, యూనిఫాం, పాకెట్ ఫీజు, బిల్డింగ్ ఫీజ్ అనేక రకమైన ఫీజులతో విద్యార్థులపైన అధిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇంత వ్యాపారం జరుగుతున్నా జిల్లాలో ఉన్న విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎసుమన్, బొబ్బిలి పట్టణ కార్యదర్శి శ్రావణ్, కార్తీక్, హేమంత్, చరణ్,రోహిత్, నితిన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా యోగాంధ్ర ట్రయల్ రన్

- పల్లె వెలుగు బస్సులో ప్రయాణించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - విజయనగరం: యోగాంధ్ర ట్రయల్ రన్ విజయవంతంగా జరిగింది. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ ఆధ్వర్యంలో జిల్లా నుండి 16 బస్సులతో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, లైజన్ అధికారులు బస్సులో ప్రయాణించారు. కలెక్టర్ అయినప్పటికీ అంబేద్కర్ సాధారణ ఉద్యోగిలా పల్లె వెలుగు బస్సులో అందరితో పాటు ప్రయాణించడం విశేషం. రహదారి మధ్యలో జిల్లా ఎస్.పి వకుల్ జిందాల్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి, జే.సి సేతు మాధవన్, అదనపు ఎస్.పి సౌమ్యలత, డి.సి.ఎం.ఎస్. చైర్మన్ గొంప కృష్ణ, వేదికల ఇన్‌చార్జ్ రోణంకి కూర్మనాద్, తదితరులు బస్సులో ఎక్కి కలెక్టర్‌తోపాటు వేదిక వరకు ప్రయాణం చేసారు. వేదికల వద్దకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ బస్సులు జాతీయ రహదారి గుండా ప్రయాణించి మారికవలస నుండి తిమ్మాపురం బీచ్ వద్దకు చేరుకొని బస్సుల రూట్లను, దిగే స్థలాలను, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. జిల్లా నుండి బయలుదేరి వెళ్ళే 660 బస్సుల కోసం తొట్ల కొండ, ఏ.పి.ఐ.ఐ.సి హిల్స్, బావి కొండలు, ఐ.టి హిల్స్ వద్ద 4 చోట్ల పార్కింగ్ కోసం కేటాయించారు. జిల్లాకు 30 కంపార్ట్మెంట్‌లు కేటాయించారు. సుమారు వెయ్యి మందికి ఒక కంపార్ట్మెంట్ చొప్పున కేటాయించి, ప్రతి కంపార్ట్మెంట్‌కు ఒక ఉన్నతాధికారి, పోలీస్ బందోబస్త్, ఒక ఇన్‌చార్జ్ అధికారిని నియమించారు. బస్సుపై వారికి కేటాయించిన కంపార్ట్మెంట్ నెంబర్‌ను రాయడం వలన అది ఏ రూట్‌లో ఉందో తెలియజేయడానికి పోలీస్ అధికారులను నియమించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

విశాలాంధ్ర - డెంకాడ: మండలంలోని పెదతాడివాడ సమీపంలో ఆర్ అండ్ బి రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని యానాది రవి (36) మృతి చెందారు. ఈ రోడ్డు ప్రమాదానికి సంబంధించి డెంకాడ ఎస్ఐ ఆరంగి సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం నెల్లిపట్ల గ్రామానికి చెందిన గోపి, యానాది రవి వ్యానుతో టమాటా లోడ్ వేసుకొని విజయనగరం వచ్చారు. అయితే తిరుగు ప్రయాణంలో కిరాయి కోసం పెదతాడి వాడ సమీపంలో గల లారీ ఆఫీస్ దగ్గర బండి ఆపారు.

బుధవారం రాత్రి 11:30 సమయంలో క్లీనర్ అయిన రవి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ విషయం తెలుసుకున్న వ్యాన్ డ్రైవర్ గోపి 108 వాహనానికి సమాచారం ఇవ్వగా అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. డెంకాడ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండల వ్యవసాయాధికారిగా సూర్య ప్రకాష్

విశాలాంధ్ర - బాడంగి: మండల వ్యవసాయాధికారిగా గొర్ల సూర్య ప్రకాష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పాడేరు జిల్లా వ్యవసాయధికారి కార్యాలయంలో వ్యవసాయ అధికారిగా విధులు నిర్వర్తించి బాడంగి మండలానికి వచ్చినట్లు తెలిపారు. మండల రైతులకి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, రాయితీలు సకాలంలో రైతులకు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇక్కడ విధులు నిర్వరించిన మండల వ్యవసాయధికారి కే.శిరీష సాలూరు మండల వ్యవసాయధికారిగా బదిలి అయ్యారు.

పాఠశాలలో మరుగు మరమ్మతులకు నిధులు మంజూరు

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల మరమ్మతు కొరకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని చీపురుపల్లి మండల ప్రత్యేక అధికారి డీఎల్‌డీఓ హేమ సుందర్‌రావు హామీ ఇచ్చారు. గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈనెల 21 శనివారం 11 అంతర్జాతీయ యోగా దినోత్సవం మండలానికి చెందిన అన్ని గ్రామ సచివాలయాల నుంచి స్థానిక పట్టణంలో ఉన్నా బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని సంబంధించి గురువారం మెనూను పరిశీలించారు. పాఠశాలలో టాయిలెట్స్ సమస్యను ప్రధానోపా ధ్యాయురాలు డి.ఉమామహేశ్వరి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఈ.ఓ.పి.ఆర్.డి, మండల ఇన్చార్జ్ ఎంపీడీవో ఐ.సురేష్, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎమ్.బూసి నాయుడు, ఏ.ఓ ప్రవీణ్, పాఠశాల సిబ్బంది హెల్త్ ఎడ్యుకేషన్ పి.స్వరూప్, కె.మురళి, పార్ట్ టైం ఇనస్ట్రక్టర్ జి.నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

విశాలాంధ్ర-లక్కవరపుకోట: మండలంలోని రంగాపురం మాజీ సర్పంచ్ దాకారపు దేవుడు నాయుడు కుమార్తె గ్రీష్మకు గురువారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, రాంప్రసాద్ దంపతులు రూ.50,000లు చదువు నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. గ్రీష్మ తండ్రి ఇటీవల కాలంలో అనారోగ్య కారణాల వలన మృతి చెందడంతో ఇచ్చిన హామీ మేరకు కోళ్ల దంపతులు గ్రీష్మ చదువు బాధ్యతలు తాము తీసుకుని గడచిన రెండు సంవత్సరాలు కాలంలో లక్ష రూపాయలు చదువుకు చెల్లించి ఈ ఏడాది సంవత్సరం ఫీజులు నిమిత్తము 50,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చౌక్కాకుల మల్లు నాయుడు, మాజీ జడ్పిటిసి సభ్యులు కరెడ్ల ఈశ్వరరావు, కే.ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ ముత్యాల నాయుడు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మానవ జీవన చైతన్య దీప్తి యోగ

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మనస్సు, శరీరం, ఆత్మలను యోగ సంయోగపరిచి చైతన్యం కలిగిస్తుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బొలికోన్నత ఆశ్రమ పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల యోగ ప్రదర్శనను వీక్షించడంతో పాటు స్వయంగా ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూఈ నెల 21న విశాఖపట్నం వేదికగా యోగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ కూడా పాల్గొంటున్నారని తెలిపారు. భారతీయుల జీవన విధానంలో యోగ అంతర్భాగమైందన్నారు.



వర్తమాన జీవన విధానంలో ఒడిదుడుకులను తట్టుకోవడానికి ఆరోగ్యవంతమైన జీవనానికి యోగ ఎంతో ఉపకరిస్తుందన్నారు. యోగలోని అష్టాంగ మార్గాలు సామాజిక, వైయుక్తిక ప్రయోజనాలకు దోహదపడతాయమన్నారు. బహుళ ప్రయోజనాలను అందిస్తున్న యోగాను భవిష్యత్ తరాలకు అందించాల్సి వుందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమాలక్ష్మి, పిడి వెంకటలక్ష్మి తదితర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతం కళాశాలలో యోగా వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా, యోగాంధ్ర-2025 పేరుతో ఉమ్మడి యోగా ప్రోటోకాల్ సెషన్‌ను సీతం ఇంజనీరింగ్ కళాశాల ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించింది. భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ (ఆయుర్వేదం, యోగా ప్రకృతి వైద్యం, యునాని, సిద్ధ, మరియు హెూమి యోపతి) దార్శనికత, లక్ష్యాలకు అనుగుణంగా "సామరస్యం, శాంతి కోసం యోగా" అనే థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. సీతమ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ శారీరక, మానసిక శ్రేయస్సును కాపాడుకోవడంలో యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భద్రాసన, దండాసన, తడసాన (తాటి చెట్టు భంగిమ), మొండెం కదలికలు, మెడ కదలికలు, ససంకాసన, భుజంగాసన, పాదహస్తసాన, త్రికోణాసన వంటి వివిధ యోగా భంగిమలను ఆయన విశదీకరించారు. ఈ సెషన్‌ను జిల్లా నోడల్ ఆఫీసర్ (జెఎన్‌టియు-జివి) ఎన్.సతీష్‌కుమార్ సమర్థవంతంగా నిర్వహించారు, వారి ప్రయత్నాలకు విభాగాధిపతులు, అధ్యాపక సమన్వయకర్తలు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సత్యనారాయణ, శిక్షణ పొందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లు సంపూర్ణ మద్దతు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి యోగా ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఆసనాల నిర్మాణాత్మక ప్రదర్శన జరిగింది. హాజరైన వారి చురుకైన భాగస్వామ్యం కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి దోహదపడింది.

జులై 5న జాతీయ లోక్ అదాలత్

సీనియర్ సివిల్ జడ్జి టీవీ రాజేష్ కుమార్

విశాలాంధ్ర - బొబ్బిలి: జులై 5న కోర్టు ప్రాంగణంలో జరుగు జాతీయ లోక్ అందాలతో వివిధ కోర్టులో పెండింగ్లో ఉన్న కేసులను ఇరువర్గాలు రాజీమార్గంలో పరిష్కారం చేసుకుంటే సత్వర న్యాయంతో పాటు విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి టీవీ రాజేష్ కుమార్ పిలుపునిచ్చారు. జులై 5న జరుగు జాతీయ లోక్ అదాలత్ లో అధిక కేసులు రాజీ మార్గంలో పరిష్కారం కావడానికి పోలీస్ ఎక్సైజ్ శాఖ సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు కృషి చేయాలని అన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసు, వివిధ బ్యాంకు కేసులు, రాజీ మార్గంలో పరిష్కారం చేయడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్రవంతి జానకిరామ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం రోహిణి రావు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

విశాఖలో యోగాంధ్రతో ప్రపంచ రికార్డ్: ఎమ్మెల్యే కళా వెంకట్రావు

విశాలాంధ్ర - చీపురువల్లి: విశాఖపట్నంలో నిర్వహించనున్న యోగేంద్ర కార్యక్రమం ప్రపంచ రికార్డుని సృష్టించనున్నదని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. గురువారం చీపురుపల్లి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో గుజరాత్ రాష్ట్రంలో కోటి మందితో నిర్వహించిన యోగా కార్యక్రమానికి దీటుగా ప్రస్తుతం యోగాంధ్రా కార్యక్రమం రెండు కోట్ల జనాభాతో విశాఖపట్నం నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రపంచస్థాయిలో రికార్డ్ సృష్టించనుందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూటమి పాలకుల నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. యోగా కార్యక్రమాన్ని దిగ్విజయంగా చేసేలాగా అందరూ కూటమి నాయకులు, తెలుగుదేశం కార్యకర్తలు జనసేన కార్యకర్తలు బిజెపి కార్యకర్తలు అందరూ కదలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

భారతదేశంలో పుట్టే యోగ ప్రపంచం మొత్తం ఆవిష్కరించుతుందని ఇది మన భారతదేశ ఘనత అని ఆయన కొనియాడారు. యోగ ఆంధ్రలో భాగంగా చంద్రబాబు నాయుడు 21వ తేదీన శ్రీకారం చుట్టి దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆహ్వానించి విశాఖ కార్యక్రమంలో భాగస్వాములు చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని అన్నారు. యోగాలో ప్రాణ శక్తి ఉందని యోగా చేయటం వలన మందులను పక్కన పెట్టే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేసి రోగాలను దూరం చేసుకోవాలని ఆయన కోరారు .యోగ శరీరంలో ఉన్న కల్మషాలను మరియు దృష్టిలోపాలను షుగర్ మరియు బిపి అనేకమైన రోగాలను దూరం చేస్తుందని గతంలో సూరత్ లో కోటి మందితో యోగ కార్యక్రమం చేశారని ఇప్పుడు రెండు కోట్లకు పైచిలుకే రిజిస్ట్రేషన్ ఆంధ్రాలో అయ్యాయని ఇది ఒక ప్రపంచ రికార్డు గా పరిగణిస్తున్నామని అన్నారు ఈ ఘనత కేవలం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే ఇది దక్కుతుందని ఎమ్మెల్యే కళా వెంకట్రావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులకు కార్యకర్తలకు ఎమ్మెల్యే కిమిడి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రౌతు కాము నాయుడు దన్నాన రామచంద్రుడు, మిషనరీ శ్రీనివాసరావు వెన్నె సన్యాసినాయుడు పైలా బలరాము రెడ్డి గోవింద నాయుడు తిరుమల రాజు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

విశాలాంధ్ర
పేజీ: 2
విజయనగరం
శుక్రవారం 20, జూన్ 2025

బదిలీలు తప్పన సరి : ఎండీఓ రాంబాబు

విశాలాంధ్ర,తెర్లాం : మండల కేంద్రం లో సమావేశ భవనంలో ఎండీఓ ఆర్. రాంబాబు వివిధ శాఖల కింద స్థాయి సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాలు ప్రకారం సచివాలయం సిబ్బందిలో పనిచేసిన ఉద్యోగస్తులతో పాటు మండల స్థాయి ఉద్యోగస్తుల వరకు నూటికి 70శాతం బదిలీలు వేటు తప్పదని ఈ సమావేశం లో పేర్కొన్నారు. మీరు ప్రతి ఒక్క సెక్రటరీ కానీ డిజిటల్ అసిస్టెంట్ కానీ, ఇంజనీర్ అసిస్టెంట్ కానీ ప్రతి సచివాలయం ఉద్యోగస్థులు విధి నిర్వహణలో 5సంవత్సరాలు పూర్తి అయిన వారికి వేరే మండలాలకు తప్పనిసరిగా బదిలీ అవుతారని అన్నారు. మీ పని చేస్తున్న గ్రామాల్లో ఇంటి పన్నులు కానీ, నీటి పన్నులు కానీ పంచాయ తీ పరంగా సెక్రటరీలు కానీ కింద స్థాయి సిబ్బంది కానీ వసూలు చేసిన రుసుము గవర్నమెంట్ అకౌంట్‌కు జమ చెయ్యాలని, మీదగ్గర ఉంచుకో కూడదు అని అన్నారు. అలాగే సిబ్బంది అంత బదిలీలు తప్పనిసరి కాబట్టి మీ స్థానాల్లో క్రొత్తవారు జాయిన్ అవు తారని ఈ సమావేశం లో ఎండీఓ ఆర్ రాంబాబు తెలిపారు.

యోగాంధ్రలో సగం ఖర్చు సుగర్ ఫ్యాక్టరీలపై పెట్టుంటే రైతులకు చాలా ప్రయోజనం: భీశెట్టి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 21న శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా విశాఖపట్నంలో నిర్వహించ తలపెట్టిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం మంచిదే అయినా,నిర్వహణ ఖర్చులో సగం ఉత్తరాంధ్ర లోని మూత పడ్డ తాండవ,ఏటి కొప్పాక, అనకాపల్లి, భీమసింగి, నష్టాల్లో తిరుగుతున్న చోడవరం సహకార చక్కెర ఫ్యాక్టరీ ల పై పెట్టివుంటే ఉత్తరాంధ్ర అభివృద్ధి తో పాటు రైతులకు చాలా లాభం చేకూరేదని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యా లయంలో విలేకరులతో మాట్లాడుతూ గడచిన నెలరోజుల నుండి ఉత్తరాంధ్ర లోని ఒక్క అధికారి ప్రజా సమస్యలపై పనిచెయ్యలేని పరిస్థితి నెలకొందని ఎవ్వరితో మాట్లాడినా యోగాంధ్ర మీటింగ్,యోగాంధ్ర ఏర్పాట్లు అని చెప్పేవారని మొత్తంగా ఉత్తరాంధ్ర పరిపాలన వ్యవస్థ పూర్తి స్థాయిలో కుంటుపడిందని బాధ్యత కలిగిన కొంతమంది అధికారులు, సిబ్బంది కూడా విసిగిపోయి పనిచేస్తున్నారని భీశెట్టి ఆరోపించారు, గత ప్రభుత్వం పనికి మాలిన నిర్వాకం తో సహకార చక్కెర ఫ్యాక్టరీలు మూత పడ్డాయని గడచిన ఐదు సంవత్సరాల గా కార్మికులకు,ఉద్యోగులకు పిఎఫ్, గ్రాట్యుటీ చెల్లించలేదని, కూటమి ప్రభుత్వం వచ్చి యేడాది పూర్తి చేసుకున్నా అదే పరిస్థితి నెలకొందని కొంత మంది కార్మికులు చనిపోయారని సహకార చక్కెర ఫ్యాక్టరీలు బాగుపడితే ఉత్తరాంధ్ర కర్షక ఆంధ్ర గా అభివృద్ధి చెందుతుం దని ఆ దిశగా ఉత్తరాంధ్ర లోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఆలోచించకపోవడం ఆవేదన కలుగుతుందని భీశెట్టి అన్నారు,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈవెంట్లపై దృష్టి సారించకుండా ఉత్త రాంధ్ర లోని మూత పడ్డ పరిశ్రమలపై, యువత కి ఉపాధి అవకాశాల కోసం,రైతులకు లాభసాటి వ్యవవసాయం కోసం దృష్టి సారించాలని కోరారు సహకార సుగర్ ఫ్యాక్టరీలు లాభసాటి కాకపోతే వారిని కేంద్ర ప్రభుత్వం సహాయంతో ఇథనాల్ పరిశ్రమలుగా మార్చి రైతులకు లాభసాటిగా చెయ్యొచ్చని అన్నారు ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నగభూసనం, పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు పాల్గొన్నారు.

39వ డివిన్‌లో సహాయ కమిషనర్ కిల్లాన సందర్శన

విశాలాంధ్ర -విజయనగరం : నగరంలోని 39వ డివిజన్ పరిధిలో గురువారం నిర్వహించిన వార్డు సందర్శన కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు పాల్గొన్నారు. ఆర్ అండ్ బి జంక్షన్ నుండి ప్రారంభమైన వార్డు సందర్శన కార్యక్రమంలో పలు అంశాలను గుర్తించారు. కాలువలు, రహదారులు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాల పై ప్రజాభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే తాగునీటి పంపిణీ నిర్దిత వేళలకు జరుగుతున్నాయా లేదా అని అడిగారు.

నీటి నాణ్యత పరీక్షలను జరిపి అన్ని సక్రమంగా నిర్వహిస్తున్నట్లు సహాయ కమిషనర్ దృష్టికి ఏమినిటీస్ కార్యదర్శి తీసుకుని వచ్చారు. వార్డు సందర్శన అనంతరం సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కమిషనర్ పల్లి నల్లనయ్య సూచనలతో ప్రతివారం ఒక్కో డివిజన్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే ప్రతి డివిజన్ కు 20 లక్షల రూపాయల చొప్పున అభివృద్ధి పనులు నిమిత్తం వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే అవి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వింత ప్రభాకరరెడ్డి,నగరపాలక సంస్థ ఏడో సీతారామ మూర్తి, సిబ్బంది,సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం

విశాలాంధ్ర, గుర్ల: మండలంలో పాలవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును, ఎం పీపీ ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు, సర్పంచ్ వల్లూరు రాము ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి వీధికి సీసీ డ్రైనేజీ, సీసీ రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజ లందరూ సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు, బంగారునాయుడు, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు

రూ.10వేల విలువగల పాఠ్యపుస్తకాలు అందజేత

పాఠశాల రిటైర్డ్ హెచ్‌ఎం శంకర్రావు ఉదారత

విశాలాంధ్ర, వేపాడ : - మండలంలోనిదబ్బిరాజుపేట మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ చేసిన పూర్వ ప్రధానోపాధ్యాయులు రెడ్డి శంకర్రావు ఉదారతతో రూ. 10వేల విలువ గల పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.గురువారం దబ్బిరాజుపేట పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, రబ్బ ర్లను,విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామ పెద్దలు,పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల రిటైర్డ్ హెచ్.ఎం రెడ్డి శంకరరావు మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుకునే విద్యా ర్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు.ఆయనకు పాఠశాల ప్రధా నోపాధ్యాయులు వి.వరప్రసాద్, ఆర్.చల్లం నాయుడు,ఇతర ఉపాధ్యాయ బృందం పాఠశాల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పంట మార్పిడితోనే అధిక దిగుబడులు

విశాలాంధ్ర,మెంటాడ : వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించడానికి పంట మార్పిడితోనే సాధ్యపడుతుందని ఏరువాక కేంద్రం ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త లక్ష్మణ్ అన్నారు. ఏరువాక కేంద్రం విజయనగరం మరియు రిలయన్స్ ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మెంటాడ మండలం పెదచామాలాపల్లి గ్రామంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో ముఖ్యంగా రైతు పండించే పంటల్లో సరైన మార్పులు తీసుకు వచ్చినట్లయితే రైతులు అధిక దిగుబ డులు సాధించవచ్చునని డాక్టర్ లక్ష్మణ్ తెలియ జేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మన పెద చామలాపల్లి పరిసర ప్రాంతాల్లో ఎక్కువమంది రైతులు సరైన సమయంలో నాట్లు వేయకపోవడం వలన దిగుబడులు తగ్గుతున్నాయని అన్నారు. అందు కొరకు రైతులు పంటలు ఎద జల్లే పద్ధతులను వేసుకోవడం వలన ఖర్చు తగ్గించి అధిక దిగుబడి సా ధించవచ్చునని అన్నారు. అంతేకాకుండా వెదజల్లిన మూడు రోజులు లోపల రైతులు పిటా క్లోర్ అనే మందును ఎకరాకు 60 మిల్లీగ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకు న్నట్లయితే మొదటి దశలో వచ్చు కలుపు నివారించుకోవచ్చు అని తెలియజేశారు.మీరు మరింత వ్యవ సాయ సమా చార కొరకు రిలయన్స్ ఫౌండేషన్ వారి టోల్ ఫ్రీ నెంబర్ 1800 419 8800 సంప్రదించగలరని తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మరియు రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, సురేష్ పాల్గొన్నారు.

22న ఉచిత నేత్ర వైద్య శిబిరం

మెంటాడ: విశాలాంధ్ర :-మండలంలోని పెదమేడపల్లి గ్రామ సచివాలయం వద్ద ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ కార్యదర్శి రేవంత్ ఒక ప్రకటనలో తెలిపారు.శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో జరగనున్న ఈ శిబిరంలో కంటి సంబంధిత సమస్య ఉన్నవారు తనిఖీలు చేసుకోవాలని,ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు,అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కంటి శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు,ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొని రావాలని తెలిపారు.

నేడే మండల సర్వసభ్య సమావేశం

మెంటాడ: విశాలాంధ్ర: -మెంటాడ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ ఏ భానుమూర్తి తెలిపారు.ఈ సమావేశం నకు మండలశాఖ అధికారులు తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.ఎంపిపి రెడ్డి సన్యాసి నాయుడు అధ్యక్షతన జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ సమావేశం నకు సర్పంచ్ లు ఎంపిటిసి లు హాజరుకావాలని ఆయన కోరారు.

యోగ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

నగర పాలక కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర -విజయనగరం : జిల్లా యంత్రాంగం నిర్దేశించిన ప్రకారం ప్రణాళిక బద్ధంగా వ్యవహరించి 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సచివాలయ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు గురువారం సచివాలయ కార్యదర్శులతో విడతల వారీగా సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో నిర్వహించ తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని శతశాతం విజయవంతం చేసే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా సచివాలయ కార్యదర్శులకు నిర్దేశించిన విధంగా ప్రజలను యోగ వేదికల వద్దకు తరలించాలని సూచించారు. ఆరోజు ఉదయం 3 గంటలకే తప్పనిసరిగా సచివాలయాల నుండి బస్సులు ప్రజలతో తరలించే విధంగా చూడాలన్నారు. ప్రతి సచివాలయం నుండి కనీసం 300 మందిని తరలించే విధంగా ఉద్యుక్తులను చేయాలని చెప్పారు. సచివాలయల వద్దకు వచ్చే బస్సులకు ఇన్చార్జిలుగా ఆర్పీలను, మేస్త్రీలను నియమించినట్లు చెప్పారు. ఎవరైనా ఆసక్తి చూపించి విశాఖపట్నంలో జరిగే యోగా కార్యక్రమానికి వెళ్తామంటే అట్టివారిని కూడా అక్కడికి పంపించే ఏర్పాట్లు చేయాలన్నారు. అదేరోజు సచివాలయాల పరిధిలో ఉదయం 6:30 గంటలకు యోగ కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం రాజీవ్ స్టేడియంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. ఈ సమావేశంలో టిపిఆర్ఓ సింహాచలం పాల్గొన్నారు.

ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలి : సీనియర్ సివిల్ జడ్జి కృష్ణ ప్రసాద్

విశాలాంధ్ర, విజయనగరం కంటోన్మెంట్ : ఈరోజు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బాబామెట్టలో జరిగిన న్యాయ అవగాహన సదస్సు కార్యక్ర మమునకు ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి కృష్ణ ప్రసాద్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి పాల్గొన్నారు. కార్యక్రమంలో వారు విద్యార్థు లను ఉద్దేశించి మాట్లాడుతూ వారికి గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి వివరంగా తెలియజేశారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని ఒక్క తల్లిని తప్ప ఎవరిని నమ్మలేని పరిస్థితులు ఉన్నాయని ,తల్లిదండ్రుల చెప్పిన మాటలు తప్పక వినాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులలో బాలికలపై జరుగుతున్న అగత్యా లను వారు ఖండించారు.బాలికలు అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. ప్రతిరోజు పేపర్ చదివే అలవాటు చేసుకోవాలని అందువలన సమాజంలో జరిగే పరిస్థితులు అర్థం అవుతాయని హితువు పలికారు. విద్య హక్కు చట్టం గురించి, బాల కార్మిక వ్యతిరేక చట్టం గురించి, యా చక బాలల నిరోధం గురించి విద్యార్థులకు తెలియజేశారు. 14 ఏళ్ల లోపు బాలబాలికలు స్కూల్ లోనే ఉండాలని వారిని పనికి పంపరాదని హితవు పలికారు. ఎవరైనా బాలలను పనిలో గాని దుకాణాలలో గాని పనిచేయించి నట్లయితే అట్టివారు శిక్షార్హులని తెలియజేశారు. బాలికలతో ముఖాముఖిగా చర్చించి వారి యొక్క సందేహాలు, సమస్యలు ఏవైనా ఉన్నట్లయితే తమకు తెలియజేయాలని సూచించారు. ఎవరైనా బాలికలకు ఇబ్బందులకు గురి చేస్తే వాటిని తమ దృష్టికి తీసుకొని వస్తే వారిపై న్యాయపరమైన చర్యలు ఉంటాయని తెలియజేశారు. బాల బాలికలకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఎప్పుదు అండగా ఉంటుందని వారు ఏ సమయం లోనైనా జాతీయ న్యాయ సేవ అధికారి సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేసి వారి సమస్యలను తెలపవచ్చని తెలియ జేశారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమంలో పి.రమణమ్మ స్కూల్ హెచ్ఎం, స్కూల్ హెచ్ఎం న్యాయవాది పి.వి. వరలక్ష్మి , బెజ్జిపురం ఎన్జీవో కోఆర్డినేటర్ జి.ఝాన్సీ పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మిగిలిన గురుకుల సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర -విజయనగరం : విజయనగరం మరి యు మన్యం జిల్లాలలో గల డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6,7,8,9 తరగతిలో మిగిలి యు న్న సీట్ల అడ్మిషన్ కోసం దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్లు ఉమ్మడి జిల్లా గురుకుల సమన్వయకర్త ఎస్. రూపావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 19 నుండి విజయనగరం జిల్లాలో గల 8 పాఠశాలలో మరియు పార్వ తీపురం మన్యం జిల్లాలో ఉన్న 5 పాఠశాల్లో ఈ దరఖాస్తులను స్వీక రిస్తామన్నారు. దరఖాస్తు చేసు కున్న విద్యార్థి/విద్యార్థినులకు ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా బాలురుకు కొప్పర్ల, బాలికలకు నెల్లిమర్లలో 25 జూన్, బుధవారం ఉదయం 10.00 గంటల నుం డి 11.00 గంటల వరకు పరీక్ష నిర్వహిం చడం జరుగుతుందని వివరిం చారు.ప్రతి తరగతి యొక్క ప్రశ్న పత్రం ముందు తరగతిలో ఉన్న సిలబస్ అనగా లెక్కలు, సైన్స్, సోషల్ సబ్జెక్ట్స్ మీద ప్రశ్న ప్రత్రం ఉంటుంది అని ఆమె తెలిపారు. SC,ST,BCOC వెనుకబడిన వర్గాల విద్యార్థి/విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా ల ని ఆమె ఒక ప్రక టనలో కోరారు. ఇతర వివరములకు ఈ దిగువ తెలియ జేసిన నెంబర్‌కి ఫోన్ చేసి 8985883015/630 3838 657 / 99511 20330 సమాచారం పొందగలరు అని తెలిపారు.

తల్లికి వందనం పథకంలో డబ్బులు పడని అర్జీదారులకు న్యాయం చేయండి

- మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు

విశాలాంధ్ర - బొబ్బిలి : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంలో లబ్ధిదారులకు శత శాతం న్యాయం జరిగేలా సంబంధిత వార్డు సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకో వాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ చైర్మన్ రాంబారికి శరత్ బాబు ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి అధ్యక్షతన తల్లికి వందనం సంక్షేమ పథకం పై సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు పాల్గొని విద్యాశాఖ కార్యదర్శులు తల్లికి వందనం స్కీం నిమిత్తం లబ్ధిదారులకు సహాయం చేయు నిమిత్తం పైన పేర్కొన్న సెక్రటరీలు అందరూ ప్రతీ రోజు తమ తమ సచివాలయములలో కార్యాలయ పనివేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, అలాగే తల్లికి వందనం స్కీం రాని లబ్ధిదారులకు ఎందుకు రాలేదో...? అందుకు తగిన కారణములను లబ్ధిదారులకు అర్థమయ్యే విధంగా వివరించాలని, ఈ స్కీం విషయమై ప్రజలకు ఎలాంటి సందేహములు ఉన్నయెడల వాటిని ఎప్పటికప్పుడు నివృత్తి చేయవలసినదిగా, అలాగే అర్హత ఉండి కూడా స్కీం రాని వారు ఉంటే అలాంటి లబ్ధిదారుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి అందలకు సంబంధించిన గ్రీవెన్స్ ను ఆన్లైన్ నందు అప్ డేషన్ చేయవలసినదిగా గాను ఆదేశించియున్నారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ మేనేజరు పి వి టి రాఘవాచార్యులు పాల్గొన్నారు

యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

- రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ , సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ప్రైవేటు పాఠశాలలకు రెండు రోజులు సెలవులు : జిల్లా కలెక్టర్ అంబేద్కర్



విశాలాంధ్ర -విజయనగరం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న యోగాంధ్ర కార్యక్రమం లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి విజయవంతం చేయాలనీ రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ , సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ తో కలసి మంత్రి వెబెక్స్ ద్వారా ఎం.పి.డి.ఓ లు, లైజన్ అధికారులతో మాట్లాడి పలు సూచనలు జారీ చేసారు. ప్రతి బస్సులో మెడికల్ కిట్ ను ఏర్పాటు చేయాలనీ, వాటర్ బాటిల్స్ ను, అలాగే ఏ .ఎన్ .ఎం లను కూడా నియమించాలని తెలిపారు. బస్సు లు 5.30 లోపలే వేదికల వద్దకు చేరేలా చూడాలని తెలిపారు. కార్యక్రమం అనంతరం ట్రాఫిక్ సమస్య తలెత్తి ఆలస్యం అయ్యే అవకాశం ఉందని, బ్రేక్ ఫాస్ట్ ను కూడా బస్సు లలో ఏర్పాటు చేయాలనీ కోరారు. లైజన్ అధికారులతో, పొలిటికల్ కార్యకర్తలతో కలిపి ఒక వాట్సప్ గ్రూప్ ను ఏర్పాటు చేయాలనీ తెలిపారు. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ మాట్లాడుతూ 21 న జిల్లాలో చేసే యోగ కార్యక్రమానికి 5714 కోట్ల 9,63,450 మంది తో యోగా కోసం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విశాఖపట్నం లో జరిగే కార్యక్రమానికి జిల్లా నుండి 30 వేల మందిని పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ రోజు యోగాంధ్ర ట్రయల్ రన్ విజయవంతంగా జరిగిందని తెలిపారు . జిల్లా నుండి బయలు వెళ్ళే 660 బస్సులను ఏర్పటు చేసామని, ఈ బస్సు లు ఉదయం 2.30 కల్లా తప్పని సరిగా ప్రారంభం కావాలని ఎం.పి.డి.ఓ లకు ఆదేశించారు. కలెక్టరేట్ లో ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామని, రాత్రి 1 గంట నుండి నిద్ర లేపి బస్సు ల వద్దకు వచ్చేలా చూస్తామని, ప్రతి మండలానికి ఇద్దరేసి అధికారులు ఇంచార్జ్ లుగా కంట్రోల్ రూమ్ లో రాత్రంతా పని చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి బస్సు పైన కంపార్ట్మెంట్ నెంబర్ తప్పనిసరిగా రాయాలని, వేదికవద్దకు చేరుకోగానే ఆ నెంబర్ ను బట్టి పోలీస్ లు ఎటు వేళ్ళలో మార్గం చూపిస్తారని తెలిపారు. బస్సు లలో మహిళలు, బాలికలు వెళ్ళే బస్సు లకు మహిళా పోలీస్ ను కేటాయించాలని ఎస్.పి ని కోరారు. లైజన్ అధికారులు యాప్ లో లాగిన్ అయి వారి బస్సు లో వెళ్ళే వారి పేర్లను వెంటనే నమోదు చేయాలనీ సూచించారు.

ఈ సమావేశం లో జిల్లా ఎస్.పి వకుల్ జిందాల్ , డి.ఆర్.డి.ఏ పి.డి కళ్యాణ చక్రవర్తి, సి.పి.ఓ బాలాజీ, డిప్యూటీ రవాణా కమీషనర్ మని కుమార్, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ సత్యనారాయణ, డి.ఈ.ఓ మాణిక్యం నాయుడు, డి.పి.ఓ మల్లి ఖర్జునరావు, ఎస్.ఎస్.ఏ పి.ఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు రెండు రోజులు సెలవులు : జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాఖపట్నంలో ప్రధాని మోడీ ఆధ్వర్యంలో ఈ నెల 21 న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి బస్సు లు తరలించడం వలన జిల్లలో నున్న ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 20,21 తేదీలలో సెలవులు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు.

వైభవంగా సిరమ్మ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర విజయనగరం టౌన్ : గురువారం సిరి సహస్ర (సిరమ్మ) జన్మదినం సందర్భంగా నగరంలో ప్రదీప్ నాయుడు, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యుల తో కలిసి స్థానిక కొత్త పేట లో ఉన్న శ్రీ సంపత్ వినాయకుని ఆలయం ను దర్శించి, స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి,పండితుల ఆశీర్వ చనం పొందారు. అనంతరం ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీ శ్రీ శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించి, పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి, వేద పండితుల ఆశీర్వాదం పొందారు. సిరి సహస్ర రైసింగ్ పేల స్, ధర్మపురి ఇంటి వద్ద ఎన్.వి. ఎస్.బ్లడ్ బ్యాంకు వారిచే రక్త ధాన శిభిరం ను నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు, మరియు కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు, రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న బ్లడ్ క్యాంపు లో పాల్గొన్నారు. డెఫ్ అండ్ డం స్కూల్ లో కేక్ కటిం గ్ పిల్లలకు చాక్లెట్స్ బిస్కెట్స్ పంపిణీ చేశా రు., హిజ్రాస్ కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన చీరలు పంపిణీ, వికలాంగులకు వీలు చైర్స్ పంపిణీ, అన్నదానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పద్మనాభ%శీ% పార్టీ ఆఫీసులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలతో కేక్ కటింగ్ చేశారు. మధ్యాహ్నాం గం 01.00 నిమిషాలకు ఆనందపురం శుభంశ్రీ ఫంక్షన్ హాల్ లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భీమిలి నియోజకవర్గం లోని పద్మనాభం, ఆనం దపురం, భీమిలి, మధుర వాడ, ఎండా డ, తగరపువలస, కార్యకర్తలు మరియు చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తో కేక్ కటింగ్ చేసి, వచ్చిన వారికి విందు ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు మరియు విజయనగరం జిల్లా చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తదిత రులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికులకు బేసిక్ వేతనం ఇవ్వాలి

సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

విశాలాంధ్ర విజయనగరం టౌన్ మున్సిపల్ ఇంజనీరింగ్ వాటర్ వర్క్స్, పర్యావరణ, ఎలక్ట్రికల్ , నాన్ పిహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం 21000, టెక్నికల్ వేతనం 24,500 చెల్లించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం బాలాజీ నగర్ వాటర్ ట్యాంక్ నుంచి కొత్తపేట వాటర్ ట్యాంక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర నాయకులు బి రమణ, మున్సిపల్ యూనియన్ నాయకులు ఏ. జగన్మోహన్రావు, ఎస్ రామునాయుడు, భాస్కర్ రావు, వెంకటేష్ లు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ నాన్ పీహెచ్ కార్మికులకు ప్రభుత్వం జీతాలు పెంచుతూ తక్షణమే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, రిటర్మెంట్ బెనిఫిట్, 62 సంవత్సరాల వరకు కొనసాగింపు, థర్డ్ పార్టీ కార్మికులకు అప్కాస్ కార్మికులతో సమానంగా వేతనాలు ప్రతినెల 10వ తేదీలోపు చెల్లించాలన్నారు. థర్డ్ పార్టీ కార్మికులకు ఇప్పటికి రెండు నుంచి మూడు నెలల జీతాలు బకాయిలు ఉన్నాయని ఈఎస్ఐ,పిఎఫ్ సక్రమంగా అమలు కావడం లేదని పండగ జాతీయ సెలవు దినాలు వర్తింప చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పైన ప్రభుత్వం ,అధికార యంత్రాంగం సానుకూలంగా స్పందించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏ రోజు నుంచి సమ్మె చేస్తే ఆ రోజు నుంచి విజయనగరంలో ఇంజనీరింగ్ వాటర్ సప్లై కార్మికులందరూ కూడా సమ్మె కు సిద్ధం కాబోతున్నారని హెచ్చరించారు. బైక్ ర్యాలీలో ధనుంజయ , సత్యనారాయణ, రాజు, ఉమామహేశ్వరరావు, తిరు తదితరులు పాల్గొన్నారు.